క్లుప్తంగా

ఏఎస్సై శర్మకు ఎస్సైగా పదోన్నతి


ఆర్ఎస్ శర్మ

ఐనవోలు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆర్ఎస్ శర్మ శనివారం ఎస్సైగా పదోన్నతి పొందారు. 1989లో కానిస్టేబుల్‌గా నియామకమైన ఆర్ఎస్ శర్మ ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో వివిధ పోలీస్ స్టేషన్లలో జనరల్ డ్యూటీ, రైటర్‌గా అంకితభావంతో పనిచేస్తూ గుర్తింపు పొందాడు. ఎస్సైగా పదోన్నతి పొందిన శర్మకు ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. శర్మ ఆగస్టులో పదవీ విరమణ పొందనున్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నడికూడ: మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన పర్షబోయిన అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం 2000–01 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు రాముడెడ్డి, శివాజీ, దేవేందర్, ఐలయ్య, రవి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపి రూ.25వేల ఆర్థికసాయం చేశారు.

యూనియన్ అధ్యక్షుడిగా కుమారస్వామి



కమలాపూర్ : సెంట్రింగ్ వర్కర్స్ యూనియన్ కమలాపూర్ పట్టణ అధ్యక్షుడిగా పుల్లా కుమారస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెంట్రింగ్ వర్కర్లు శనివారం స్థానికంగా సమావేశమై యూనియన్ ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వేయిగండ్ల మహేష్, పుల్లా ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మాట్ల మనోజ్‌కుమార్, కోశాధికారిగా శనిగరపు రాజు ఎన్నికయ్యారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులుగా రవి, మల్లయ్య, కుమారస్వామి, ఉపేందర్, రమాకాంత్, శంకర్, వెంకటేష్, రాజు, రత్నం, బద్రి, మాధవ్, శోభన్, భిక్షపతి, శంకర్, నూతన్ నియమితులయ్యారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

శాయంపేట : మండలంలోని మాందారిపేట స్టేజి నుంచి నేడు (ఆదివారం) నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ దాసి శ్రావణ్‌కుమార్ శనివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూపాలపల్లిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం చేయడానికి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరావు వస్తున్న సందర్భంగా కేటీఆర్‌కు స్వాగతం పలకాలన్నారు. మండలంలోని బీఆర్ఎస్ మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్యాయత్నం


యువకుడిని 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

వేలేరు: మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన తూముల కిరణ్ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కిరణ్ ఇంటర్ వరకు చదివి ఇంటివద్ద ఖాళీగానే ఉంటున్నాడు. తల్లిదండ్రులు బతుకుదెరువు నిమిత్తం కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఇంట్లో ఒక్కడే ఒంటరిగా ఉండటంతో శనివారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగానని తన స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పడంతో స్నేహితుడు వచ్చేసరికే ఇంట్లో పడి ఉన్నాడు. గమనించిన స్నేహితులు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

బాలికల గురుకులం తనిఖీ

న్యూశాయంపేట: హనుమకొండ హంటర్ రోడ్డులోని మైనారిటీ బాలికల గురుకులాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి కేఏ.గౌస్ హైదర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని పరిశీలించి, హాస్టల్ పరిశుభ్రతను పరిశీలించారు.

ప్రభుత్వ భవనాలకు మోక్షమెప్పుడో ?

- పేరుకే మండలం, సొంతభవనాల ఊసే లేదు
- పాత భవనాల్లోనే కార్యకలాపాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


ఎస్సీ హాస్టల్ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

వేలేరు : పరిపాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. 2016లో వేలేరును నూతన మండలంగా ఏర్పాటు చేశారు. అంతకుముందు పాత మండలమైన ధర్మసాగర్ మండలంలోనే వేలేరు కలిసి ఉంది. అయితే వేలేరు మండలంగా ఏర్పడిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాలను పాత భవనాల్లోనే ఏర్పాటు చేశారు. ఏళ్లు గడుస్తున్నా మండలానికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో అధికారులు అసౌకర్యాల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సీ హాస్టల్ భవనంలో తహసీల్దార్ కార్యాలయం ఒక వైపు, పోలీస్ స్టేషన్ మరోవైపు ఏర్పాటు చేసి కార్యాకలాపాలు కొనసాగిస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయం గతంలో అద్దె భవనంలో కొనసాగింది. ప్రభుత్వం సకాలంలో అద్దె చెల్లించడం లేదని భవనం యాజమాని అందులో నుంచి ఖాళీ చేయాలని గొడవ చేయడంతో అధికారులు అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఎంఆర్సీ భవనంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని అక్కడికి మార్చారు. అలాగే మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని రైతు వేదికలో, విద్యుత్ శాఖ అధికారి కార్యాలయం ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి సెక్షన్ ఆఫీస్‌లో, విద్యాశాఖ అధికారి కార్యాలయం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేశారు. అలాగే మండలంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు

మండల పరిషత్ కార్యాలయ నిర్మాణానికి కొన్ని నెలల క్రితం ప్రభుత్వం రూ.1.50 కోట్లతో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. పలు సందర్భాల్లో మండలానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీహరి కార్యాలయ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని చెబుతున్నా అది ఆచరణలోకి రావడం లేదు. ఇప్పటికైనా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయ భవనాలను ఏర్పాటు చేసే విధంగా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


ఎమ్మార్సీ భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

సొంత భవనాలు నిర్మించాలి



మండలం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయలేదు. సొంత భవనాలు లేకపోవడంతో పాలన అసౌకర్యాల నడుమ సాగుతోంది. ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించడం లేదు.

– ఇట్టబోయిన సంపత్, వేలేరు

ఎంపీడీఓ ఆఫీస్‌ను తరలించాలి



ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా కార్యాలయానికి నిత్యం ప్రజలు, వివిధ శాఖల అధికారులు వస్తుండటంతో విద్యార్థులు చదువుపై ఏకాగ్రత చూపడం లేదు. అలాగే విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలం కూడా లేదు. వెంటనే ఎంపీడీఓ కార్యాలయాన్ని వేరే చోటుకు తరలించాలి.

– ఆరీఫ్, వేలేరు

జెండా గద్దెను తొలగించాల్సిందే..

- లక్ష్మీపురం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడికి గ్రామ కార్యదర్శి నోటీసు జారీ
- కేటీఆర్ పర్యటనకు ముందు హైడ్రామా...!


లక్ష్మీపురంలో నిర్మించిన బీఆర్ఎస్ జెండా గద్దె

పరకాల : అక్రమంగా నిర్మాణం చేసిన బీఆర్ఎస్ జెండా గద్దెను తొలగించాలని లక్ష్మీపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లెబోయిన రాజుకు గ్రామ కార్యదర్శి రిజ్వానా శనివారం నోటీసు జారీ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఆయన చేతుల మీదుగా జెండా ఆవిష్కరించేందుకు లక్ష్మీపురంలో బీఆర్ఎస్ జెండాను నిర్మాణం చేశారు. అయితే ఈ జెండా పంచాయతీ రాజ్ చట్టం–2018 ప్రకారం అక్రమంగా గుర్తిస్తూ అక్రమ నిర్మాణమంటూ తక్షణమే కూల్చివేయాలంటూ గ్రామకార్యదర్శి జెండా గద్దె నిర్మాణానికి ఎలాంటి రంగులు వేయకుండా అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. రోడ్డు పక్కనే టీడీపీ జెండా ఉన్నప్పటికీ పట్టించుకోకుండా బీఆర్ఎస్ జెండా గద్దె నిర్మాణాన్ని అడ్డుకోవాల్సిన అవసరమేంటని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ బలంగా ఉంటుందన్న ఆలోచనతోనే కాంగ్రెస్ నాయకులు గ్రామ కార్యదర్శిపై ఒత్తిడి తీసుకొచ్చి జెండా తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ఏది ఏమైనా కేటీఆర్ పర్యటనకు ఒక్కరోజు ముందు పరకాలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వార్ చోటుచేసుకోవడం విశేషం.

సహకార సంఘం అభివృద్ధికి పాటుపడాలి


రైతులకు రశీదులు అందజేస్తున్న చైర్మన్ శరత్

శాయంపేట : సహకార సంఘం అభివృద్ధికి రైతులు పాటుపడాలని పీఏసీఎస్ చైర్మన్ శరత్, వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలో రైతులు శనివారం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్(ఎఫ్‌పీఓ)లో రూ.1000 చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని రైతులు ఎఫ్‌పీఓ స్కీమ్‌లో చేరడానికి ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


నక్క చిన్నక్క(ఫైల్)

దామెర: మండలకేంద్రంలో శతాధిక వృద్ధురాలు మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నక్క చిన్నక్క (105) వయోభారంతో కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కాగా శనివారం తెల్లవారుజామున స్వగృహంలో కన్నుమూశారు. చిన్నక్కకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు కాగా గతంలో కుమారుడు మృతిచెందాడు.

ప్రమాదకరంగా గుంత



నడికూడ : మండంలోని కంఠాత్మకూర్ గ్రామ హనుమాన్ గుడి మలుపు వద్ద పరకాల–అంబాల ప్రధాన రహదారిపై గుంతపడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలో వరద నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు గుర్తించకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు నాలుగు లైన్ రోడ్డు పనులు జరుగుతున్న నేపథ్యంలో నిత్యం ఆర్ అండ్ బీ అధికారులు తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి తాత్కాలికంగా గుంతను పూడ్చి వేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

ఖిలా వరంగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. వరంగల్ కరీమాబాద్‌లోని మున్నూరుకాపు సంఘ భవనంలో ఎగ్గేని మల్లికార్జున్, ఐతం నాగేష్, మాలోతు ప్రత్యూష అధ్యక్షతన భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వరంగల్ నగర ప్లీనరీ సమావేశం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా రవి మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి తమ ఇష్టానుసారంగా పాలన కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. పేద, మధ్య తరగతి ప్రజలపై నిత్యావసర వస్తువుల ధరల భారం విపరీతంగా పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రజా పోరాటాలే సమస్యల పరిష్కారానికి శరణ్యమని అన్నారు.

కోనో కార్పస్ చెట్లను తొలగించండి


కోనో కార్పస్ చెట్లను తొలగించాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి పల్లె ప్రకృతి వనంలో ఏర్పాటు చేసిన కోనో కార్పస్ చెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సందర్భంగా శనివారం బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గూబ దేవేందర్ మాట్లాడుతూ కోనోకార్పస్ చెట్ల వల్ల అస్తమా, అలర్జీ, శ్వాసకోశ సంబంధ వ్యాధుల బారిన పడుతారన్నారు. గతంలో మండలంలోని అనేక జీపీల్లో కోనోకార్పస్ చెట్లు అధికారులు తొలగించారన్నారు. ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని జీపీ అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుమారస్వామి, మహేందర్, ఎల్లయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

దామెర : ఉపాధిహామీ నిధులతో పలు యూనిట్ల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఓ శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 ఆర్థికసంవత్సరానికి మండలంలో పౌల్ట్రీ షెడ్లు 10 యూనిట్లు యూనిట్ ఒక్కంటికి (100) నాటు కోళ్లు, యూనిట్‌కు రూ.85 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా పశువుల షెడ్లు 40 యూనిట్‌కు(3) పశువులు, యూనిట్‌కు రూ.98 వేలు ఇస్తామన్నారు. గొర్రెలు, మేకల షెడ్లు 2 యూనిట్లు (10) గొర్రెలు లేదా మేకలు రూ.98 వేలు మంజూరు చేస్తామన్నారు. కొత్త బావి తవ్వకం 2 యూనిట్లు, యూనిట్‌కు రూ.300000, ఇంకుడు గుంతలు 100 యూనిట్లు యూనిట్‌కు రూ.6,500, అజోళ్ల పెంపకం 10 యూనిట్లు, యూనిట్‌కు రూ.20 వేలు, వెర్మి లేదా నాడెపు కంపోస్టు పిట్స్ 10 యూనిట్లు, యూనిట్‌కు రూ.15 వేలు, ఎస్సీ, ఎస్టీలకు 5 ఎకరాలలోపు వారికి మండల వ్యాప్తంగా భూమి సేద్యంలో లేని 150 ఎకరాల వరకు అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. సోమవారం నుంచి బుధవారం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ చిన్న, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9281479613, 9281479632, 9281479662, 9281479663 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న దామెర కిరణ్

విద్యారణ్యపురి: రాష్ట్రంలో అనేక గురుకులాలు అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయని, అలాంటి గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ డిమాండ్ చేశారు. హనుమకొండ రాంనగర్‌లోని ఎస్ ఎఫ్ ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ఫీజు రీ యింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్, బాధ్యులు బీరెడ్డి జస్వంత్,తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన అదనపు కలెక్టర్


భోజనాన్ని పరిశీలిస్తూ విద్యార్థినితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

ఐనవోలు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంలో స్టోర్ రూంలో నిత్యావసర సరుకులను తనిఖీ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. బోధన, నాణ్యమైన భోజనం అందుతుందా, వసతులు ఎలా ఉన్నాయి అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు ఆహార పదార్థాలను అందించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాగా, నీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని బోరు ఏర్పాటు చేయాలని విద్యార్థినులు అదనపు కలెక్టర్‌ను కోరారు. ఆయన వెంట తహసీల్దార్ విక్రమ్‌కుమార్, కేజీబీవీ ఇన్‌చార్జ్ శోభ, దివ్య, వంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలతో మానసిక ఇబ్బందులు

- ఎంపీడీఓ అనిల్ కుమార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఎస్సై దిలీప్

ధర్మసాగర్ : మాదకద్రవ్యాల సేవనం వల్ల ఆరోగ్యకరంగా, మానసికంగా ఇబ్బందులు ఏర్పడతాయని ఎంపీడీఓ అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని ఉనికిచర్ల శ్రీనివాస రామానుజన్ కాన్సెప్ట్ స్కూల్లో శనివారం ప్రహరీక్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మాదకద్రవ్య రహిత సమాజ ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా ఎంఈఓ డాక్టర్ రామ్‌ధన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మాదకద్రవ్యాల సేవిస్తే వ్యక్తులు, కుటుంబాలు, సమాజం మొత్తం తీవ్రమైన దీర్ఘకాలిక సమస్యల్లో కూరుకుపోతారని అన్నారు. విద్యార్థులు, యువత ఈ విషయం పట్ల జాగ్రత్తతో ఉండాలని తెలిపారు. ఎస్సై దిలీప్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవిస్తే రోడ్డు ప్రమాదాలు పెరుగుతాయని, ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ సంస్థలతో పాటు పౌర సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బద్దం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్నేహితుల ఒత్తిడితో గంజాయి, ఆల్కహాల్, హెరాయిన్, కుకాయిన్ లాంటి మత్తు పదార్థాల బారిన విద్యార్థులు, యువత పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. అందుకే వీటివల్ల సంభవించే శారీరక, ఆర్థిక, సామాజిక నష్టాలను తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

- మండల్ స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్


మొక్క నాటుతున్న మండల్ స్పెషల్ ఆఫీసర్ నవీన్ కుమార్

నడికూడ : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని మండల్ స్పెషల్ ఆఫీసర్ బక్కి నవీన్ కుమార్ అన్నారు. శనివారం మండంలోని రాయపర్తి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే సరైన సమయంలో వర్షాలు పడాలి, అలా జరగాలంటే ప్రతీ ఇంటికి కనీసం ఆరు మొక్కలైన నాటాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి పరిసరాలను పరిశీలించి, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ కూడ నీరు నిలువ ఉండకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, గ్రామపంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని సరఫరా చేయాలని, అప్పుడే వ్యాధులకు దూరంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విమల, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం


అనూష చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మారెడ్డి

దామెర : బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన కుసుంబ అనూష ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి శనివారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే విధంగా ఊరుగొండకు చెందిన మోతె బాలకృష్ణ ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు గండు రాము, మాజీ ప్రజాప్రతినిధులు గరిగె కల్పనకృష్ణమూర్తి, కాగితాల శంకర్, ఎండీ. జాకర్ అలీ, గోగుల సత్యనారాయణ రెడ్డి, పున్నం సంపత్, రఘుపతి రెడ్డి, నాయకులు రమేష్ యాదవ్, మల్లయ్య, సునీల్‌రెడ్డి, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్


శాయంపేట: స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు


ఆత్మకూరు : ర్యాలీలో విద్యార్థులు, ప్రిన్సిపాల్ అనిత

శాయంపేట : మండల కేంద్రంలోని బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటికొండ రవికిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వీట్లు తినిపించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో సైనికులను, సైనికుల కుటుంబ సభ్యులను స్మరించుకుంటారని తెలిపారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ పై భారత సైన్యం విజయాన్ని సాధించిన గుర్తుగా విజయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాయరాకుల మొగిలి, ఉప్పు రాజు, కానుగుల నాగరాజు, లడే శివ, కోమటి రాజశేఖర్, ఎర్ర రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంజేపీలో ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ

ఆత్మకూరు: మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం కార్గిల్ దివస్‌ను పురస్కరించుకొని ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అలాగే దేశభక్తికి సంబంధించిన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ కార్గిల్ యుద్ధ విశేషాలను వివరించారు. ఆపరేషన్ సిందూర్ ప్రపంచంలోనే గొప్ప విజయమన్నారు. విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ, కవితారాణి పాల్గొన్నారు.